తహసీల్దార్ల బదిలీ

గజ్వేల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులను జారీ చేశారు. రాయపోల్ తహసీల్దార్ దివ్యను కొమురవెల్లి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయ డీఏవోగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను రాయపోల్ తహసీల్దార్‌గా, జగదేవ్‌పూర్ తహసీల్దార్ చంద్రమోహన్‌ను సిద్దిపేట ఆర్డీవో కార్యాలయ డీఏవో బదిలీ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయ భూసేకరణ విభాగం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జగదేవ్‌పూర్ తహసీల్దార్‌గా అక్కడే పని చేస్తున్న నాయబ్ తహసీల్దార్ రఘువీర్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

మల్లన్న ఆలయ బుకింగ్ ఆదాయం రూ.58.39లక్షలు

చేర్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ వారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి దండిగా మొక్కుబడులు, ఆర్జిత సేవలు నిర్వహించారు. అన్ని కలిపి శనివారం రూ.4,61, 054, ఆదివారం రూ.45,34,028, సోమవారం రూ.8,44,431 చొప్పున రూ.58,39,513 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.46.87 లక్షలు ఆదాయం సమకూరగా, ఈ సారి రూ.11.52లక్షల మేర పెరిగిందని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.



క్యూలో బారులుతీరిన భక్తులు

అవును వారు.. కలిసిపోయారు



- అధికార పార్టీలో సయోధ్య
- కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి
- ఇప్పటికే ఓ దఫా చర్యలు పూర్తి
- మరో మూడు రోజుల్లో మరోసారి భేటీ?
- పరస్పరం ఆరోపణలు చేసుకోబోమని ఒప్పందం
- పార్టీ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక
- నామినేటెడ్ పదవుల్లోనూ చర్చలు కొలిక్కి...?
- స్థానిక సంస్థల ఎన్నికల్లోపు వర్గాలకు సెలవు పట్టే దిశగా అడుగులు



గజ్వేల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిన్న, మొన్నటివరకు ఉప్పు నిప్పుగా ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కటైపోయినట్లు తెలుస్తుంది. రెండు రోజుల క్రితం వారి మధ్య సయోధ్య కుదిరినట్లు సమాచారం. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్ నియోజకవర్గంలోని ఇరువర్గాలను సమన్వయం చేసి సయోధ్య కుదిర్చినట్లు తెలుస్తోంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోకుండా పార్టీ కోసం కలిసి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే ఓ దఫా చర్చలు పూర్తయ్యాయని, వచ్చే మూడు, నాలుగు రోజుల్లో మరో దఫా చర్చలను మైనంపల్లి సమక్షంలో నిర్వహించనున్నట్లు అధికార పార్టీ నాయకులు తెలిపారు. ఇరు వర్గాలు కలిసి పని చేయాలని, కలిసి పని చేసిన వారికి, పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రభుత్వంలో, పార్టీలో పదవులు తప్పకుండా వస్తాయని నచ్చచెప్పినట్లు తెలుస్తుంది. ఏఐసీసీ ఇన్‌చార్జి మార్పు, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధిష్ఠానం గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల్లోని ఆయావర్గాలను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు బాధ్యతలను అప్పగించగా, ఈ మేరకు వారిద్దరూ దిద్దుబాటు చర్యలను చేపట్టినట్లు సమాచారం.

పార్టీకి నష్టం కలిగించొద్దు

గజ్వేల్ నియోజకవర్గంలో వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు మీడియా ముఖంగా, బహిరంగంగా ఆరోపణలు చేసుకోబోమని మైనంపల్లి సమక్షంలో ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ వ్యవహరించకూడదని ఇరు వర్గాలకు నచ్చజెప్పినట్లు తెలుస్తుంది. ఏఐసీసీ, టీపీసీ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేలా ప్రణాళిక చేయాలని, అందుకు అనుగుణంగా ఇరువర్గాలు కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఇరువర్గాలకు నాయకులుగా ఉన్న నేతలు మాత్రం ఇప్పటికి ఉప్పు నిప్పుగానే ఉన్నట్లు ఆయా వర్గాల నాయకులు చెబుతున్నారు. ఇలా ఉన్నప్పటికీ ఆరోపణలు చేసుకోకుండా చూసుకుంటామని ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తుంది.

నామినేటెడ్‌పై చర్చ

గజ్వేల్ నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవుల భర్తీ అంశం సైతం ఇరువురు నాయకుల మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఇరువురు అంగీకారాన్ని తెలిపినట్లు సమాచారం. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మినహా, వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ, తూప్రాన్, కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీలు, ఆత్మ కమిటీలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వాటిని భర్తీ చేసేందుకు కొన్నాళ్లుగా అధిష్ఠానం ప్రయత్నిస్తున్న, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో ఎందుకొచ్చిన తలనొప్పి అని పెండింగ్‌లో పెట్టారు. ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిరిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల అంశం చర్చకు వచ్చినట్లు, ఈ మేరకు ఒప్పందం సైతం కుదుర్చుకున్నట్లు అధికారికంగా తెలుస్తోంది.

కలిసికట్టుగా పనిచేసేలా చర్యలు...

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గజ్వేల్‌లో వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే సయోధ్య దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉన్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముక్కలుగా విడిపోయి పోటీ చేస్తే మొదటికే మోసం వచ్చే అవకాశం ఉన్నందున ఇరువర్గాలు కలిసి ఏకతాటి పైన పనిచేస్తే బలమైన ప్రతిపక్షాన్ని ఢీకొట్టే అవకాశం ఉందని, అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో దిద్దుబాటు చర్యలను చేపట్టింది. ఒకటి రెండు రోజుల్లో ఇరు వర్గాల మధ్య మరో దఫా చర్చలు నిర్వహించనున్నారు. ఈ చర్చలు ఫలిస్తే గజ్వేల్ నియోజకవర్గంలో ముక్కలుగా విడిపోయిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటిగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. కాగా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్నందున కలసిపోయిన కాంగ్రెస్ నాయకులు ఒక్కటిగా కలిసి ఉంటారా... అంటూ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులే బాహాటంగా మాట్లాడుకుంటున్నారు.



రేషన్ ఇవ్వరా..?

- నేటికీ అందని బియ్యం
- జిల్లాలో 686 దుకాణాలకు 421 షాప్‌లకు మాత్రమే పంపిణీ
- ఆందోళనలో డీలర్లు, వినియోగదారులు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కోసం డీలర్లు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి రేషన్‌షాపులకు అందాల్సిన బియ్యం నేలాఖరుకు చేరుతున్నాయి. రైస్ అలాట్‌మెంట్‌కు సివిల్‌సప్లయ్ సిబ్బంది, రేషన్ కోటాకు డీలర్లు, బియ్యం కోసం లబ్ధిదారులు ఇలా ఎవరి వారు ఎదురుచూస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేవారు. 11వ తేదీ వచ్చినా మార్చిలో ఇవ్వాల్సిన రేషన్ ఇప్పటికీ పంపిణీ చేయలేదు. ఉగాది పండుగ నాటికైనా రేషన్ బియ్యం అందుతుందా లేదా అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటి వరకు 3,118 మెట్రిక్ టన్నుల సరఫరా...

ప్రతినెలా ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ మొదలై పదో తేదీ నాటికి దాదాపు పూర్తవుతుంది. ఈసారి పదో తేదీ దాటినా ఇంకా సుమారు 50 శాతం రేషన్ దుకాణాలకు బియ్యమే చేరలేదు. మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి నెలాఖరులోగానే దుకాణాలకు బియ్యం సరఫరా కావాలి. ఈసారి ఎంఎల్ఎస్ పాయింట్లకే ఒకటో తారీఖు తరువాత అలాట్‌మెంట్ ఇవ్వడంతో ఈ సమస్య ఏర్పడింది. జిల్లాలోని 686 రేషన్ షాపులకుగాను 421 షాప్‌లకు రేషన్ బియ్యం సరఫరా చేశారు. ఇంకా 265 షాపులకు ఇంకా రేషన్ అందనేలేదు. జిల్లాలో ఈ మార్చి నెలకు సంబంధించి 4,870 మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉండగా.. 3,118 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే రేషన్ షాపులకు అందించారు. పట్టణాల్లో ఉన్న రేషన్ షాపులకు ముందుగా బియ్యం అందజేసి గ్రామాల్లో ఉన్న షాపులకు బియ్యం సప్లయ్ ఆలస్యం చేస్తున్నారని డీలర్లు చెబుతున్నారు. సివిల్ సప్లయ్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనుజశ్రీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా 3,118 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం రేషన్ షాపులకు సరఫరా చేశామని మరో రెండు రోజులలో పూర్తిస్థాయిలో సరఫరా చేస్తామని తెలిపారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానివ్వం

- మార్చి చివరి నాటికి మల్లన్నసాగర్ నుంచే తాగునీరు
- గజ్వేల్ మిషన్ భగీరథ ఈఈ వి. శ్రీనివాస్

ఫేస్ టు ఫేస్



గజ్వేల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామని గజ్వేల్ మిషన్ భగీరథ ఈఈ వి.శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించామని, మార్చి నాటికి మల్లన్న సాగర్ నుంచి తాగునీటిని అందిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

గజ్వేల్ మిషన్ భగీరథ డివిజన్ పరిధిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయా?

గజ్వేల్ మిషన్ భగీరథ డివిజన్ పరిధిలో గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు ఉంటాయి. మూడు మునిసిపాలిటీలతో పాటు 400 పైచిలుకు గ్రామాల్లో తాగునీటిని అందిస్తున్నాం. ప్రతి రోజు 72 ఎంఎల్‌డీ(మెగా లీటర్స్ పర్ డే) నీటిని ప్రజలకు అందిస్తున్నాం. ప్రస్తుతానికి ప్రజలకు సరిపడా 70ఎంఎల్‌డీ తాగునీటిని హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా తీసుకుంటున్నాం. కోమటిబండ జీఎల్‌బీఆర్ ద్వారా ప్రజలకు అందజేస్తున్నాం.

గజ్వేల్ డివిజన్ పరిధిలో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి? అన్ని కనెక్షన్లకు తాగునీరు అందుతుందా?

మిషన్ భగీరథ గజ్వేల్ డివిజన్ పరిధిలో 1,31,893 కనెక్షన్లు ఉన్నాయి. అన్ని కనెక్షన్లకు తాగునీటిని అందిస్తున్నాం. ఎత్తులో ఉన్న కనెక్షన్లకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుర్తించాం. వాటిని త్వరలోనే మరమ్మత్తు చేసి అందరికి సమానంగా నీటిని అందేలా కృషిచేస్తాం. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు 8ఎంఎల్‌డీ నీటిని అందించాల్సి ఉండగా ప్రస్తుతం 11ఎంఎల్‌డీ అందిస్తున్నాం. తూప్రాన్ మున్సిపాలిటీకి 7.3 ఎంఎల్‌డీ కావాల్సి ఉండగా సరిపడా సరఫరా చేస్తున్నాం. దుబ్బాక మునిసిపాలిటీకి 3.5 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నాం.

హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి రోజువారీగా ఎంత నీటిని తీసుకుంటున్నారు? మల్లన్నసాగర్ నుంచి ఎప్పుడు నీటి సరఫరా ప్రారంభిస్తారు?

ప్రస్తుతానికి హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి 70ఎంఎల్‌డీ నీటిని తీసుకుంటున్నాం. హైదరాబాద్‌లో నీటి వినియోగం డిమాండ్ పెరగడంతో గతంతో పోల్చితే కొద్దిగా తగ్గించారు. మల్లన్నసాగర్ నుంచి మంగోల్ భారీ నీటి జలాశయం ద్వారా ఈ నెలాఖరుకు తాగునీటిని కోమటిబండకు చేర్చనున్నాం. మంగోల్-అక్కారం మధ్య ఎనిమిది కిలోమీటర్లలో 3కిలోమీటర్ల పైప్‌లైన్ పూర్తి అయింది. మరో ఐదు కిలోమీటర్లు ఈ నెల 25వరకు పూర్తి చేయించనున్నాం. నెలాఖరుకు మల్లన్నసాగర్ నీటిని గజ్వేల్ డివిజన్ ప్రజలకు అందిస్తాం.

వేసవి సందర్భంగా ప్రజలకు ఏమైనా చెప్తారా?

వేసవి సందర్భంగా తాగునీటిని వృథా చేయకుండా పరిమితంగా వాడుకోవాలి. ట్యాంకులకు ఓవర్‌ఫ్లో కాకుండా వాల్వ్‌లను బిగించుకోవాలి. ముఖ్యంగా అక్కడక్కడా పలువురు డ్రైనేజీలో నీటిని వదిలేస్తున్నారు వాటిని నియంత్రించాలి. ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఉండే వెంటనే అధికారులకు తెలియపరచాలి. ప్రజలు నీటి సరఫరా అధికారులతో సహకరించాలి.


జ్యోతిష్యం పేరుతో రూ.లక్ష స్వాహా

- టీవీలో స్క్రోలింగ్ చూసి డబ్బు పోగొట్టుకున్న కమలాయపల్లి గ్రామస్థుడు
- నిందితుడి రిమాండ్.. రూ.లక్ష రికవరీ.. సెల్‌ఫోన్ సీజ్


మద్దూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): "జ్యోతిష్యం చెప్పబడును"... అంటూ టీవీలో వచ్చిన స్క్రోలింగ్‌ను చూసి జ్యోతిష్యుడి వలలో చిక్కుకొని రూ.లక్ష పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం కమలాయపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం మద్దూరు పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ శ్రీను వివరాలు వెల్లడించారు. కమలాయపల్లి గ్రామానికి చెందిన నారాయణచారి కొద్ది రోజులుగా ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. జనవరిలో ఓ టీవీ ఛానల్‌లో జ్యోతిష్యం చెప్పబడును అంటూ వచ్చిన స్క్రోలింగ్‌ను చూసి ఫోన్ చేశాడు. జ్యోతిష్యం చెప్పించుకుంటే బాధలు తొలగిపోయి మంచి జరుగుతుందని గుంటూరు జిల్లా పెద్దపలకనూర్‌కు చెందిన జ్యోతిష్యుడు దక్షిణపు శివయ్య నమ్మబలికాడు. దీంతో నారాయణచారి జ్యోతిష్యుడు చెప్పిన విధంగా మొదట అతని అకౌంట్‌కు రూ.50 వేలు పంపించాడు. వారం తర్వాత జ్యోతిష్యుడు ఫోన్ చేసి పూజకు డబ్బు సరిపోలేదని సగంలో ఆగిపోయిందని నమ్మించడంతో మళ్లీ నారాయణచారి రూ.50వేలు పంపించాడు. వారం తర్వాత జ్యోతిష్యుడు ఫోన్ చేసి డబ్బు కావాలని పూజ పూర్తవ్వలేదని చెప్పాడు. పూజ పూర్తవ్వకపోతే చెడు జరుగుతుందని చెప్పడంతో అనుమానం వచ్చింది. మోసపోయినట్లు భావించిన నారాయణచారి 1930 నెంబరుకు కాల్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేశాడు. వచ్చిన పిటీషన్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని పరిశోధన చేసి సాంకేతిక పరిజ్ఞానంతో జ్యోతిష్య నిందితుడు దక్షిణపు శివయ్యను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. జాతకాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపాడని అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ సీజ్ చేసి బాధితుడు నారాయణచారికి రూ.లక్ష రీఫండ్ చేయించినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. టీవీల్లో వచ్చే యాడ్స్‌ను చూసి మోసపోవద్దన్నారు. అపరిచిత కాల్స్‌ను లిఫ్ట్ చేయరాదని సూచించారు. సమావేశంలో ఎస్ఐ షేక్ మహబూబ్ ఉన్నారు.

గ్రూప్-2లో మెరిసిన జిల్లా విద్యార్థులు

- ఎన్సాన్‌పల్లికి చెందిన వడ్లకొండ సచిన్‌కు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్



సచిన్



మణికంఠేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటకల్చరల్/హుస్నాబాద్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2 ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తాచాటారు. సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన వడ్లకొండ సచిన్ రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించాడు. తెలంగాణ ఉద్యమకారుడు నిమ్మ నర్సింహారెడ్డి మనుమడైన సచిన్ ప్రాథమిక విద్య సిద్దిపేటలో పూర్తిచేశాడు. ఇంటర్ పూర్తయ్యాక ఢిల్లీ బీఎంఎల్ ముంజల్ యూనివర్శిటీలో ఉన్నత విద్య పూర్తిచేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో రెండు సంవత్సరాలు పనిచేశారు. అనంతరం పోటీ పరీక్షల వైపు ఆసక్తి కనబరిచాడు. మంగళవారం విడుదలైన గ్రూప్ 2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించారు. అలాగే గ్రూప్1లో 461.5 మార్కులు సాధించారు.

హుస్నాబాద్ యువకుడికి 103 ర్యాంక్

గ్రూప్2 ఫలితాల్లో హుస్నాబాద్‌కు చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఐలేని అనితారెడ్డి తనయుడు మణికంఠేశ్వర్‌రెడ్డి 103వ ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. మణికంఠేశ్వర్ రెడ్డి తండ్రి అయిలేని శ్రీనివాస్‌రెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.



బస్వాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

- సదుపాయాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా గ్రామాల్లో తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కోహెడ మండలం బస్వాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్ఫినేటివ్ విద్యా ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్‌లను కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. గ్రామాల్లోకి ప్రైవేట్ స్కూళ్ల బస్సులు బంద్ చేసి ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని చెప్పారు. 30 ఏళ్ల క్రితం చెప్పిన టీచర్ల పేర్లు ఇప్పటికీ తాను మర్చిపోలేదన్నారు. పాఠశాలలో డ్రింకింగ్ వాటర్, అదనంగా రెండు తరగతి గదులు, స్పోర్ట్ మెటీరియల్ అవసరముందని మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాసరెడ్డి, డీపీవో దేవకి, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవో పద్మయ్య, విద్యా ఫౌండేషన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి రండి పొన్నం..

హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో ఈనెల 23న మల్లిఖార్జునస్వామి ఆలయంలో జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు మార్క అనిల్‌గౌడ్, కర్ర రవీందర్‌రెడ్డి, ఆలయ పూజారి తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా ఉండడమే ఫ్రెండ్లీ పోలీస్

హుస్నాబాద్: నేరస్థులతో కఠినంగా, బాధితులకు అండగా ఉండడమే ఫ్రెండ్లీ పోలీస్ అని, అదే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన కూడా అని మంత్రి ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో ఏసీపీ కార్యాలయాన్ని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రమేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో ప్రజలకు మేమున్నామనే భరోసాను ప్రజలకు కల్పించాలన్నారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులదని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్ తదితరులున్నారు.

వచ్చే విద్యాసంవత్సరం పీజీ కోర్సు ప్రారంభం

హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు తీసుకువస్తామని వెల్లడించారు. ఆయన వెంట అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి తదితరులున్నారు.

అక్కన్నపేటలో నేత్ర శిబిరం..

అక్కన్నపేట : అక్కన్నపేట మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పొన్నం హాజరై మట్లాడారు. 309 మందికి కంటి పరీక్షలు చేయగా 129 మంది ఆపరేషన్లకు అవసరం పడగా 72 మందిని ప్రస్తుతం ఆపరేషన్లు చేయుటకు ఎంపిక చేశారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- అధికారులు వినకుంటే మా దృష్టికి తీసుకురండి
- ఉమ్మడి మెదక్ నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రుల సమీక్ష

7



గోవర్ధనగిరి.. మోదుగుపూల సిరి

- సహజసిద్ధ రంగులతో హోలీ
- వారం ముందే పూల సేకరణ
- అనాదిగా ఆ ఊరి ఆనవాయితీ
- మోదుగుపూల మకరందాన్ని సేవిస్తే ఆరోగ్యప్రయోజనాలని గ్రామస్థుల నమ్మకం

7



అభివృద్ధి పనులన్నీ వేగంగా పూర్తి చేయాలి

● సమీక్షలో మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఎమ్మెల్యే పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, విద్యం, వైద్యం, విద్యుత్, మున్సిపల్ తదితరశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఏడుపాయల పుణ్యక్షేత్రంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆలయం వద్ద శాశ్వతంగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని, పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ విషయంలో ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్‌తోపాటు తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖ చేపట్టనున్న పెండింగ్ పనుల్లో వేగం చేయాలన్నారు. చెరువుల సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకొని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టలన్నారు. విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ కళాశాలల్లో అవసరమైన సదుపాయాల కల్పన కృషిచేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్‌పై అధికారులతో ఆర్డీవో సమీక్ష

నర్సాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్‌లో ట్రిబుల్ ఆర్‌పై భూ సేకరణ అంశంతో పాటు ఇతర అంశాలను ఆర్డీవో మహిపాల్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో నర్సాపూర్, శివ్వంపేట మండలాల రెవెన్యూ అధికారులతో పాటు అటవీశాఖ, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో 85 ఎకరాల మేరకు అటవీ భూమి ఉందని ఆ విషయమై కూడా చర్చించినట్లు ఆర్డీవో తెలిపారు. త్వరలోనే భూసేకరణ చేసిన రైతులకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వనదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ

పాపన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్, అర్చకులు స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు.

చైతన్యంతోనే మహిళా స్వావలంభన

● మహిళా దినోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు

పటాన్‌చెరు/హత్నూర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చైతన్యంతోనే మహిళా స్వావలంభన సాధ్యమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మెట్టు రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హక్కుల సాధన కోసం నారీశక్తి ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం కార్పొరేటర్ దంపతులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ శాసనమండలి ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి సతీమణి గీతాభూపాల్‌రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రాఆనంద్, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదవ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రోజారమణి, సీహెచ్‌వో పురుషోత్తం, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



సుహాసినిరెడ్డిని సన్మానిస్తున్న వివిధశాఖల జిల్లా అధికారులు, టీఎన్జీవో జిల్లా బృందం

సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలి

మెదక్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని, అప్పుడే మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు తమ ప్రతిభను, సత్తాను చాటుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని మహిళా ఉద్యోగులను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు శశికళ, నీలిమ, మెప్మా పీడీ ఇందిరా, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లాలోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుండాలి



బేటి బచావో-బేటి పడావోపై అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్ నర్సింలు

నారాయణఖేడ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మహిళా సాధికారిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్ నర్సింలు అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ సరస్వతీ శిశుమందిర్‌లో 'బేటి బచావో, బేటి పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, బాధ్యతలు, విద్యాహక్కు చట్టం గురించి వివరించడమే కాకుండా మహిళలు, బాలురు ఏమైనా సమస్యలు ఉంటే 100,102,104, 181, 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భూమయ్య, స్కోప్ ఎన్జీవో కౌన్సిలర్ సవిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు వరుసల రోడ్డుకు నిధులు కేటాయించాలి



రామాయిపల్లిలో సంతకాల సేకరణ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వెల్దుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ కోరారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి గౌరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామాయిపల్లి, బండపోసన్‌పల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేయాలని సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెల్దుర్తి మండల పరిధిలోని ఆయా గ్రామాల మీదుగా పిల్లికొట్టాల వరకు ఒకే వరుస రోడ్డు ఉండడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారినపడుతున్నారని, రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన మల్లన్న ఆలయం

కంగ్టి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని మల్లన్న ఆలయం మంగళవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన అర్చకుడు మహాలింగ్ స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అంతకుముందు స్వామీజీని భక్తులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. మల్లన్న ఆలయ పూజారి శ్రీకాంత్‌స్వామి ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సామూహిక కుంకుమార్చనలు

పెద్దశంకరంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నిర్మించిన పోచమ్మ ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేదబ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు కుంకుమార్చనలు చేశారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పుల్‌కల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతూర్ గ్రామంలో కొనసాగుతున్న మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 4న ప్రారంభమైన ఉత్సవాలు 8 రోజుల పాటు కనుల పండువలా సాగాయి. 11న కడుపలు కడుగుట కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

గడ్డపోతారంలో ఎల్లమ్మ జాతర

జిన్నారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారంలో ఎల్లమ్మ ఆలయ జాతర ఘనంగా జరిగింది. మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. జాతరలో వందల సంఖ్యలో భక్తులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కొత్తగా షాపు పెడుతున్నామని..

● ప్లైవుడ్ తీసుకొని ముగ్గురు పరారీ
● రూ.1.50 లక్షల విలువ, ఆలస్యంగా వెలుగులోకి

తూప్రాన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా దుకాణం ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఫర్నిచర్ చేయించేందుకు మెటీరియల్ కావాలని లక్షన్నర విలువైన సామగ్రి తీసుకున్నారు. ఓ షెట్టర్‌లో వేసినట్లు నమ్మకం కలిగించారు. రెండురోజుల్లో డబ్బులిస్తామని చెప్పి ఫర్నిచర్ తీసుకుని రాత్రికిరాత్రే ఉడాయించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ పట్టణంలో పూసరాం చౌదరి కొన్నేళ్లుగా గీతా ట్రేడర్స్ పేరుతో ప్లైవుడ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడి షాపు వద్దకు గతనెల 27న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కొత్తగా అక్షయసాయి ఆస్పత్రి ఎదురుగా షాపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెండురోజుల్లో డబ్బులు ఇస్తామని రూ.1.50 లక్షల విలువైన ప్లైవుడ్ షీట్స్, ఫెవికోల్, డెకొలమ్ షీట్స్ తీసుకుని షాపులో దించుకున్నారు. 28న డబ్బులు ఇస్తామని నమ్మించారు. 28న డబ్బులు ఇవ్వకపోగా, దుకాణం వద్దకు వెళ్లగా కొనుగోలు చేసిన ప్లైవుడ్‌తో పరారీ అయ్యారు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ పైనుంచి వెళ్లి వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

రామచంద్రాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంకర్(లారీ) కింద పడుకున్న గుర్తు తెలియని వ్యక్తి పైనుంచి లారీ పోవడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. తెల్లాపూర్‌లోని ఎలియన్స్ ఫేస్ స్టేషన్ వద్ద పార్కుచేసిన వాటర్ ట్యాంకర్ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి(45-50) పడుకున్నాడు. ట్యాంకర్ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు నడపడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొల్లూరు పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



వట్టేపు స్వామి (ఫైల్)

చేగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని భర్త మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అహ్మద్ మొయినుద్దీన్ వివరాల ప్రకారం.. నార్సింగి పట్టణానికి చెందిన వట్టేపు స్వామి(32)కి చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన శిరీషతో మూడేళ్లల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గతంలో పెద్దలు సమక్షంలో పంచాయితీ నిర్వహించి శిరీషను అత్తవారింటికి తీసుకువచ్చారు. ఇటీవల అన్న మృతిచెందాడని వడియారం పుట్టింటికి వెళ్లిన శిరీష 20 రోజులైనా రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన స్వామి ఆత్మహత్య చేసుకుంటున్నానని తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు నార్సింగి మండలం వల్లూరు అటవీ ప్రాంతానికి వెళ్లి చూసేసరికి స్వామి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

యువకుడు అదృశ్యం



కత్తి ప్రభాకర్ (ఫైల్)

మనోహరాబాద్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలో పనిచేసే యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన కత్తి ప్రభాకర్(30) సూపర్ సీడ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భార్య కత్తి కోమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగునీరు విడుదల చేయాలి: రైతులు

హవేళిఘణపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జక్కన్నపేట పోచమ్మరాల్ గ్రామాల్లో మహబూబ్ కెనాల్ నీరు అందక ఆయకట్టు చివరి గ్రామాల శివార్లలో వేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ గ్రామ శివారుల్లోని సుమారు 50 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నది. అధికారులు స్పందించి కెనాల్ ద్వారా వరి పంటకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కరెంట్ సరఫరాలో ఇబ్బందులున్నాయా?

రైతులతో మాట్లాడిన విద్యుత్ అధికారి



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డైరెక్టర్ నందకుమార్

కొండాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంటపొలాలకు అందిస్తున్న త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని విద్యుత్ శాఖ డైరెక్టర్ నందకుమార్ ఆరా తీశారు. మంగళవారం ఆయన మండలంలోని తేర్పోల్‌ను సందర్శించారు. నేరుగా పంట పొలాల వద్దకు వెళ్లి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఎలా ఉందని రైతులన అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో అంతరాయం వంటి సమస్యలున్నాయా? నిర్ణీత సమయానికి సరఫరా జరుగుతుందా అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నామని, వ్యవసాయం పేరుతో అనుమతి లేని విద్యుత్‌ను ఉపయేగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు. ఆయన వెంట జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనాథ్, డీఈ రవీందర్‌రెడ్డి, ఏడీఏ వీరారెడ్డి, మండల ఏఈ సిద్ధిరాజ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ జోక్యంతో కార్మికులకు న్యాయం



పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి జోక్యంతో కార్మికులకు న్యాయం జరిగింది. జిల్లాలోని సదాశివపేట పరిధిలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో కొంత కాలంగా ట్రైనీ కార్మికులు, యాజమన్యానికి మధ్య వివాదం ఉంది. దీంతో తమకు న్యాయం చేయాలని ట్రైనీ కార్మికులు కలెక్టర్‌ను సంప్రదించారు. కార్మికులు విజ్ఞప్తి మేరకు ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ప్రతినిధులతో కలెక్టర్ మంగళవారం సమావేశమై చర్చించారు. దీంతో ట్రైనీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, అర్హతలను బట్టి కార్మికులకు రూ. 18 వేల నుంచి రూ.24 వేలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టు కార్మికులుగా పది సంవత్సరాలు పనిచేసిన కార్మికులకు గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలని కలెక్టర్ క్రాంతి పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ చర్చల్లో డీసీఎల్ రవీందర్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలు పెద్ద వ్యాపారాలు చేయొచ్చు..



మహిళా సంఘాలతో త్రిపుర రాష్ట్ర సభ్యులు

దౌల్తాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్యల ద్వారా పెద్ద వ్యాపారాలు చేయవచ్చునని త్రిపుర రాష్ట్ర బృందం సూచించింది. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మంగళవారం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి త్రిపుర రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది సభ్యుల బృందం హాజరైంది. ఈ సందర్భంగా వారు మహిళల ఆధ్వర్యంలో నిరవహించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ, వాటి వల్ల రైతులకు లాభాలు వంటి అంశాలను తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీ సీఓ కనకరాజు, గజ్వేల్ ఎఫ్‌సీ సీఓ రవీంద్రచారి, అకౌంటెట్లు మహేష్, దేవశీల, చైర్‌పర్సన్ కనకలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కార్యదర్శి లావణ్య, బోర్డు డైరెక్టర్లు హాజరయ్యారు.

రామయ్యకు గోటి తలంబ్రాలు



గోటితో తలంబ్రాలు తయారు చేస్తున్న భక్తులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి రామయ్య కల్యాణానికి శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రామకోటి రామరాజు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ఎంతోమంది భక్తులతో గోటితో ఒలిచిన తలంబ్రాలను తయారు చేయిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని గణేష్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష ప్రారంభించారు. దాదాపు 200 మంది భక్తులు పాల్గొని రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఓలిచి రామకోటి రామరాజుకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పెందోటి శ్రీనివాస్, చంద్రమౌళి, రవి, వెంకటేష్, అర్చకులు వెంకటరమణచారి, సీతారామాంజనేయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల తయారీపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణ చైతన్య

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల తయారీ, పరిశోధన మెలకువలు అనే అంశంపై డిగ్రీ, పీజీ ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌నకు దాదాపు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ డిపార్ట్‌మెంట్ డీన్, ప్రొఫెసర్ కృష్ణ చైతన్య ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో నాణ్యమైన ప్రాజెక్టులు రావడం వల్ల తర్వాత కాలంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలో ఉపయోగపడతాయని గణాంక, సాంకేతిక సాధనాల విషయంలో మంచి నైపుణ్యం పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని పరిశోధన మెళుకువలతో మంచి ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. కార్యశాల కన్వీనర్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. అయోధ్య రెడ్డి, సులేమాన్ అహ్మద్, డాక్టర్ ఉమామహేశ్వరి, గురుచరణ్ దాసు, డాక్టర్ టి శ్రీనివాస్‌తోపాటు వాణిజ్య వ్యాపార శాస్త్ర విభాగాల అధ్యాపకులు, కళాశాల ఆచార్యులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరి..

మోదుగుపూల సిరి

సహజసిద్ధ రంగులతో హోలీ

- వారం ముందే పూల సేకరణ
- అనాదిగా ఆ ఊరి ఆనవాయితీ



మోదుగు చెట్టు పూలను తెంపుతున్న గ్రామస్థులు



హుస్నాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ వచ్చిందంటే చిన్నారులను మొదలుకొని యువతీ, యువకులు, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలుతారు. అయితే, చాలా మంది రసాయానాలతో తయారు చేసిన రంగులను చల్లుకుని సంబరాల్లో మునిగిపోతుంటారు. కానీ, ఆ గ్రామంలో మాత్రం రసాయన రంగులకు దూరంగా ప్రకృతి సిద్ధంగా లభించే మోదుగు పూలతో రంగులు తయారు చేసుకుని హోలీ సంబురాల్లో పాల్గొంటారు. అనాదిగా వస్తున్న ఈ ఆనవాయితీని నేటి తరం కూడా పాటిస్తోంది.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామస్థులు హోలీ పండుగకు వారం రోజుల ముందుగానే గ్రామశివారులో మోదుగు పూలను తెచ్చుకుని, వాటిని నాలుగు రోజుల పాటు నీటిలో నానబెడుతారు. ఆ పూలను ఉడకబెట్టి రంగు తీస్తారు. ఈ రంగును హోలీ రోజున ఒకరికొకరు చల్లుకుని సంబరాల్లో తేలి ఆడుతుంటారు. మోదుగపూలతో రంగులు తయారు చేయడమే కాకుండా ఉదయం పూట మోదుగపూలను తెంపుకుని అందులోని మకరందాన్ని సేవిస్తారు. దీంతో శరీరంపై ఉన్న ముడతలను నయం కావడమే కాకుండా, షుగర్ వ్యాధిని కంట్రోల్ చేసే శక్తి ఉందని చెబుతారు. తమ తాత ముత్తాల నుంచి సహస సిద్ధంగా తయారు చేసిన మోదుగు పూల రంగులనే హోలీకి వాడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. వంపులు తిరిగి ఎర్రని రంగులో చిలక ముక్కు ఆకారాన్ని పోలి ఉన్న గోగుపూలతో మరెన్నో లాభాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు కూడా చెబుతారని పేర్కొన్నారు.



గ్రామ శివారు నుంచి రంగుల హోలీ కోసం మోదుగుపూలను తీసుకువస్తున్న గ్రామస్థులు



రసాయన రంగులకు దూరంగా..

మా గ్రామంలో రసాయన పదార్థాలతో తయారు చేసిన రంగులు వినియోగించం. మోదుగ పూలతో సొంతంగా రంగు తయారు చేసుకుంటాం. పండుగకు పది రోజుల ముందే పూలు తీసుకువచ్చి, నీటిలో నానబెడుతాం. తర్వాత ఉడకబెట్టి రంగు తీసి సీసాల్లో దాచుకుంటాం. హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులతో ఎంజాయ్ చేస్తాం.

-పాక సురేష్, గోవర్ధనగిరి

పెద్దల నుంచి వచ్చింది..



మా తాతముత్తాతల నుంచి ఇదే పద్ధతి పాటిస్తున్నారు. గ్రామ శివారులో మోదుగ చెట్టుకు పూసిన పూలను తెచ్చి రంగులు తయారు చేసుకుంటాం. హోలీ రోజు అదే రంగుతో ఆడుతాం. ఈ రంగు వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. ఊర్లో అందరూ మోదుగ పూల రంగులను తయారు చేసుకుంటారు.

-గొర్ల రాజు, గోవర్ధనగిరి

ముఖంపై ముడతలు పోతాయి..



మోదుగ పూల మకరందాన్ని తాగిగే ముఖంపై ముడతలు పోతాయి. మా ముత్తాతలు ఈ విషయం చెప్పారు. మేం ఇప్పటికీ పాటిస్తున్నాం. హోలీ పండుగకు మోదుగ పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకుంటాం. నాకు తెలిసినప్పటి నుంచీ హోలీకి ఇవే మా రంగులు.

-హన్మయ్య, గోవర్ధనగిరి

పొంగిపొర్లుతున్న ఘనపూర్ పెద్దవాగు

ఘనత మాదంటే మాదంటున్న.. కాంగ్రెస్, బీఆర్ఎస్

పోటాపోటీగా జలాభిషేకాలు.. గంగమ్మ పూజలు





గంగమ్మ పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కేసీఆర్.. హరీశ్ చిత్రపటాలకు జలాభిషేకం

నంగునూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రంగనాయక్‌సాగర్ ద్వారా మండలంలోని ఘనపూర్ పెద్దవాగు నిండి చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతుండటంతో ఆ ఘనత మాదంటే మాదని మంగళవారం ఇటు కాంగ్రెస్.. అటు బీఆర్ఎస్ పోటాపోటీగా పూజలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావుల చలువ వల్లే రంగనాయక్‌సాగర్ కాలువల ద్వారా గోదావరి జలాలు మారుమూల గ్రామాలకు చేరుకుని భూగర్భ జలాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కర్రెడ్ల లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ బాల్నరసయ్య, విజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వాగువద్ద కేసీఆర్, హరీష్ రావుల చిత్రపటాలకు జలాభిషేకం చేశారు. టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పేట శంకర్‌ల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ప్రత్యే క పూజ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాళేశ్వరం నీళ్లు గ్రామాలకు రావని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.



వేడుకగా యువజనోత్సవాలు

మెదక్ అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన ఉత్సవాలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వేడుకగా జరిగాయి. కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంచుకొని వాటిలోనూ రాణించాలన్నారు. యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్సహలు ఎంతో దోహదపడుతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలు..

సైన్స్ ప్రదర్శన బృంద విభాగంలో ప్రథమస్థానం వైష్ణవి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సాపూర్), వ్యక్తిగత విభాగంలో ప్రథమ గణేష్(జెడ్పీహెచ్ఎస్ లింగాయిపల్లి), రచయిత విభాగం ప్రథమ సారిక(జీడీసీ, మెదక్), యంగ్ ఆర్టిస్ట్ ప్రథమ సుష్మిత, ఫోటోగ్రఫీ ప్రథమ స్థానం(లావణ్య), వక్తృత్వ పోటీలో ప్రథమ సారికా(జీడీసీ, మెదక్), బృంద నృత్యంలో ప్రథమ నివేదిత (మెదక్)లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

మహిళల జీవనోపాధి అభివృద్ధికి నాబార్డు కృషి

జహీరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు నాబార్డు కృషిచేస్తుందని సంస్థ సీజీఎం ఉదయబాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డీడీఎస్-కేవీకేలో మహిళాదినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాబార్డ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డీడీఎస్ మహిళాసంఘాల పనితీరును ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాబార్డు అధికారులు, డీడీఎస్ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: ఎమ్మెల్సీ అంజిరెడ్డి



జహీరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నాగదేవతాలయం వార్షికోత్సవం సందర్భంగా జహీరాబాద్‌కు వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి సంఘటితంగా కృషి చేద్దామన్నారు. తన విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాగదేవతాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ పాల్గొని, మానసదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షరాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్‌జగన్, నాయకులు గొల్లబాస్కర్, శ్రీనివాసగుప్త, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నాగదేవతాలయంలోవద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

అధికారులు వినకుంటే మా దృష్టికి తీసుకురండి

ఉమ్మడి మెదక్ నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రుల సమీక్ష



సమీక్ష సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు దృష్టి సారించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, నాయకులు మైనంపల్లి హనుమంతరావు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని నమ్ముకొని పనిచేసిన నాయకులు, కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు దక్కుతాయని చెప్పారు. త్వరలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడవద్దని సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాల్లో అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయనున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకం, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, తాగునీరు, ప్రజలకు మౌలిక సదుపాయాలపై తదితర వాటికి ఆ నిధులను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనుల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. అధికారులు సహకరించకుండా తమ దృష్టికి తీసుకువస్తే.. అలాంటి అధికారులను బదిలీ చేస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, తమ విద్వేశాలను పక్కన పెట్టాలని సూచించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైన పనిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకు వివరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మాలాజగ్గారెడ్డి, ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, పూజల హరికృష్ణ, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

రాయపోల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాయపోల్‌కు చెందిన బ్యాగరి శ్రీనివాస్(45) మద్యానికి బానిస కావడంతో ఇటీవల కుటుంబ సభ్యులు నచ్చజెప్పి మాన్పించారు. సోమవారం గజ్వేల్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. అనంతరం తనకు డబ్బులు ఇవ్వాలని భార్య చంద్రకళను అడగగా నిరాకరించడంతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ మంగళవారం తెల్లవారుజామున గ్రామ చివరన చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి..



మల్లేశం మృతదేహం

రాయపోల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం మంతూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంతూరుకు చెందిన వీరమైన మల్లేశం(50) తన చిన్న కూతురు వివాహం కోసం పలువురి వద్ద అప్పు చేశాడు. అప్పుల వారి నుండి ఒత్తిడి రావడంతో మనస్తాపానికి గురైన ఆయన సోమవారం రాత్రి పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ధూళిమిట్ట,మార్చి11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ పరిధిలోని మోయతుమ్మెద వాగు నుంచి బెక్కల్ గ్రామానికి చెందిన తీగుళ్ల నాగరాజు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు చేసి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని రూ.10వేల జరిమానా విధించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

నంగునూరు,మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి దాడి చేసి తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. పట్టుబడినవారిలో నంగునూరు గ్రామానికి చెందిన ఖలీముద్దీన్ (46), మగ్దుంపూర్‌కు చెందిన గంగారబోయిన కనకయ్య(40), మయోజు బుచ్చారి(38), పాకాల చంద్రం(50) ఉన్నారని తెలిపారు. అలాగే పరారీలో మగ్దుంపూర్‌కు చెందిన పల్లారపు భూమిరెడ్డి(48) అపలాయ చెరువు చెందిన నాయిని రాజు(35), మగ్దుంపూర్‌కు చెందిన బండి భాస్కర్ (25), కోత్వాల్ భాస్కర్ (35), తాటికొండ రాజు (35), ఉన్నారని తెలిపారు. వారి నుంచి నాలుగు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7వేలు, స్వాధీనం చేసుకున్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?



రంగనాయకసాగర్ ఎడమ కాలువ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

- బంజేరుపల్లి, కోదండారావుపల్లి గ్రామాల రైతుల ఆగ్రహం
- ఇరిగేషన్ అధికారుల తీరుపై నిరసన

సిద్దిపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్ నుంచి సాగు నీరు విడుదల చేయడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి, కోదండరావుపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయా గ్రామాల రైతులు రంగనాయకసాగర్ ఎడమ కాలువ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి పంట చేతికి అందే సమయంలో నీరులేక ఎండిపోతుండడంతో గుండె తరుముకుపోతుందన్నారు. నెల రోజులు నీళ్ల విడుదల చేస్తే పంటలు గట్టెక్కుతాయన్నారు. అధికారులు సకాలంలో నీటిని విడుదల చేయకుండా ఆయా గ్రామాల రైతుల మధ్య విభేదాలు సృష్టించి గొడవలకు కారణమవుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతులు యాదచందు, చల్ల సంతోష్ రెడ్డి, నర్సింహరెడ్డి, రాజీరెడ్డి, శ్రీకాంత్, రమేష్, కొండల్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్లన్న సాగర్ నుంచి విడుదల చేసిన నీళ్లతో చెరువులు అలుగు పారడంతో నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ రైతులు మంగళవారం చెరువు వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిండు వేసవిలో గ్రామంలోని మెట్టు మల్లయ్య చెరువు, ఎర్రకుంట నీటితో కళకళలాడడం సంతోషంగా ఉందన్నారు. సమయానికి సాగు నీరు అందించి పంటలను కాపాడినందుకు కేసీఆర్, హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఇబ్రహీంపూర్ గ్రామంలో కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు



ధర్నాకు అనుమతి కోరుతూ ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్నాకు అనుమతి ఇవ్వండి

- ఎస్ఐకి బీఆర్ఎస్ నేతల వినతి

కొండపాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దీనికి నిరసనగా ఈ నెల 13న రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేసేందుకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరు నేతలు నూనె కుమార్, రాగల దుర్గయ్య, మహిపాల్ రెడ్డి,పెద్దంకుల శ్రీనివాస్ మంగళవారం కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొండపాక మండలంలో తపాస్‌పల్లి కాలువ ద్వారా చెరువులను నింపి పంటలను కాపాడిందని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ చుక్క నీరు కూడా విడుదల చేయడం లేదన్నారు.

ఎండిపోయిన పంటల పరిశీలన

కొండపాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసి ఎక్కువ లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక అన్నారు. మంగళవారం కొండపాకలో ఎండిన పంట పొలాలను సందర్శించారు. యాసంగిలో తక్కువ నీటితో పండే మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయల పంటలను సాగు చేయాలన్నారు. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు వర్షాలు పడకపోవడం వల్ల భూమిలో నీటి లభ్యత తగ్గిందన్నారు. తపస్‌పల్లి నుంచి కాలువల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నీరు అందక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.



కొండపాకలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మేమంతా ప్రజా సేవే చేస్తున్నాం

- గజ్వేల్ ఆర్పీలు



మాట్లాడుతున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆర్పీలు

గజ్వేల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మెప్మా ఆర్పీలు స్పందించారు. తామంతా ప్రజా సేవే చేస్తున్నామని, తమకు చాలీచాలని వేతనాలు వస్తున్నా కూడా కష్టపడి మెప్మాలో పనిచేస్తున్నామన్నారు. నెలకు వస్తున్న రూ.6వేల వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, అవి కూడా సరైన సమయానికి రావని తెలిపారు. తమపై కొందరు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మునిసిపల్‌కు సంబంధించిన పలు సర్వేలు, పనులు చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మా బాధను ప్రపంచానికి తెలియజేశారు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై డ్వాక్రా సంఘాల సభ్యులు

'అన్నా.. మా మనసులోని బాధను పత్రికలో ప్రచురించి బయటి ప్రపంచానికి తెలిసేలా చేశారు. ఆ కథనంతో రెండు రోజుల నుంచి ఆర్పీల తీరులో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు ఆర్పీలు మాతో మర్యాదగా మసులుకుంటున్నారు.' అంటూ ఆంధ్రజ్యోతిలో ఈ నెల 10న ప్రచురితమైన 'ఆర్పీల దారుణాలు' కథనంపై డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి తమ స్పందనను తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఒకరిద్దరు ఆర్పీలు పైఅధికారి అండతో రెచ్చిపోతున్నారని, ఆధారాలతో కూడిన వివరాలను అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆర్పీల పైఅధికారి తన సొంత పేరుతో బ్యాంకులో రుణాలు తీసుకున్నారని, ఆర్పీలు సైతం డమ్మీ పేర్లతో బ్యాంకు లింకేజీ లోన్లను తీసుకున్నారని వారు ఆంధ్రజ్యోతి ప్రతినిధి దృష్టికి తీసుకువచ్చారు.

దుబ్బాక మున్సిపాలిటీ బడ్జెట్ రూ.22.22 కోట్లు

దుబ్బాక, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దుబ్బాక మున్సిపాలిటీకి బడ్జెట్ కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆధ్వర్యంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించినట్లు తెలిపారు. సాధారణ నిధులు, వివిధ గ్రాంట్లను కలుపుకొని రూ.22.22 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 18న మున్సిపల్ తైబజార్, పశువుల సంతకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు రూ.25వేల బ్యాంకు డీడీ తీసి ఈ నెల 17లోగా సమర్పించాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన జుబేర్



ములుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర మైనార్టీ యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ చేతికి దట్టి కట్టారు.

గురుకుల విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు



మిరుదొడ్డి, మార్చి11(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రాజెక్టు నమూనాల ప్రదర్శనల్లో మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి నితిన్ నమూనా ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10వేల నగదు బహుమతి అందనున్నట్లు పేర్కొన్నారు. నితిన్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ధూళిమిట్ట,మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తీగుళ్ల సుధాకర్‌శర్మ, చేర్యాల పట్టణంలోని సద్గురు సదనం వారు మంగళవారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులతోపాటు రూ.5వేల నగదును హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డికి అందించారు.

డ్రిప్ ద్వారా వరి సాగు

మిరుదొడ్డి, మార్చి11(ఆంధ్రజ్యోతి) : మిరుదొడ్డి మండలం ఆరెపల్లి గ్రామంలో రైతు రాజేశ్వర్ డ్రిప్ పరికాల ద్వారా సాగుచేస్తున్న వరిసాగును మిరుదొడ్డి మండల వ్యవసాయాధికారి మల్లేశం మంగళవారం పరిశీలించారు. తక్కువనీటిని ఉపయోగించి పంటలను పండించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన 9వ రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్, సైక్లింగ్ పోటీల్లో సిద్దిపేట ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ క్రీడాకారులు 4 బంగారు పతకాలు, 2 సిల్వర్ మెడల్స్ సహా మొత్తం 12 మెడల్స్ కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ క్రీడాకారులను వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్, దంత వైద్యుడు డా. అరవింద్ అభినందించి సన్మానించారు.

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతీ హిందువు బాధ్యత

- సద్గురు మాహాదేవస్వామి



ధర్మసభలో ప్రసంగిస్తున్న సద్గురు మాహాదేవస్వామి

చేర్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సనాతన హిందూధర్మ పరిరక్షణ ప్రతీ హిందువు బాధ్యత అని సద్గురు మహాదేవస్వామి అన్నారు. ఆదిజగద్గురు రేణుకాచార్య జయంతిని పురస్కరించుకుని ఆయన ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నుంచి యాదాద్రి-భువనగిరి జిల్లాలోని కొలనుపాక సోమేశ్వరస్వామి దేవాలయం వరకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 1200 మందితో సనాతనధర్మ జాగృతి మహాపాదయాత్ర ఇటీవల చేపట్టగా మంగళవారం కొమురవెల్లికి చేరుకుంది. వీరికి కొమురవెల్లి వీరశైవలింగాయత్ సమాజం వారు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన ధర్మసభలో ఆయన అనుగ్రహభాషణం చేశారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని, దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం సద్గురు మహాదేవస్వామి హిందూ భక్తగణంతో చేర్యాల మండలకేంద్రం మీదుగా కొలనుపాకకు పయనమయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వీరశైవ సమాజం రాష్ట్ర నాయకుడు మహదేవుని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు పడిగన్నగారి నాగయ్య, మల్లన్న ఆలయ స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఉద్యోగసంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, అర్చకులు పాల్గొన్నారు.

కార్తీకకు ఘన సన్మానం



కార్తీకను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయపోల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని పంజాల కార్తీక ఆవర్తన పట్టికలోని మూలకాలను అతి తక్కువ సమయంలో చెప్పి ప్రపంచ రికార్డు సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కార్తికతో పాటు వారి గైడ్ ఉపాధ్యాయుడు కొల్కూరి భాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్తికకు రూ. 3వేలు, డిక్షనరి, డ్రెస్సు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణరెడ్డి, హెచ్ఎంలు అంజిరెడ్డి, నాగరాజ్, సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూటీఎస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, కనకారెడ్డి, తులసీదాస్, నాగరాజు, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రాములపల్లిలో భూమి పూజ చేస్తున్న నర్సారెడ్డి

కుకునూరుపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు కుకునూరుపల్లిలో పెద్దమ్మతల్లి ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనడంతోపాటు మహంకాళి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఐలమ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, ఉపేందర్, ఇండ్ల కనకయ్య, రవి పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో..



కోహెడ : సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కోహెడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో స్పెషల్ ఈజీఎస్ గ్రాంట్ రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం, బొమ్మగాని శివకుమార్, బండ జగన్, గుగ్గిళ్ల శ్రీనివాస్, సతీష్, రాంచంద్రరెడ్డి, సాగర్ రావు, ఖమ్మం రమేష్, నరాల శ్రీకాంత్, కంది సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



ధూళిమిట్ట, మార్చి11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



సిద్దిపేట కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత వేంకటేశ్వరాలయ 55వ వార్షికోత్సవాలు వైభోవోపేతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సుదర్శన నారసింహ హవనము, లక్ష పుష్పార్చన నివేదన చేశారు. సాయంత్రం రథ ప్రతిష్ఠ హోమం చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.

పాలకవర్గం ఏర్పాటయ్యేనా?

- దశాబ్దకాలంగా కొండపాక మార్కెట్ ఎదురు చూపులు
- గ్రూపు విబేధాలతో పెండింగ్‌లో పెట్టిన గత సర్కార్
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ చూపేనా?

కొండపాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొండపాక మార్కెట్ కమిటీ ఏర్పడి దశాబ్దకాలం దాటినా ఇప్పటివరకు పాలకవర్గమే ఏర్పాటు చేయలేదు. ఇందుకు గ్రూపు విబేదాలే కారణమని తెలుస్తున్నది. కొండపాక మండలం మార్కెట్ కమిటీ 2014లో ఏర్పాటుకాగా, సుమారు రూ.3కోట్ల వ్యయంతో మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు గోదాములను నిర్మించారు. కొండపాక మండలం దొమ్మాట నియోజకవర్గంలో ఉన్న సమయంలో తొగుట మార్కెట్ కమిటీ పరిధిలో ఉండేది. గజ్వేల్ నియోజకవర్గంలో కలిసిన తర్వాత కొండపాక మండలం గజ్వేల్ మార్కెట్ పరిధిలోకి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు అన్ని మండలాల్లో వ్యవసాయ మార్కెట్‌లను ఏర్పాటు చేసిన అప్పటి సర్కార్ కొండపాకలోనూ ఏర్పాటు చేసింది. అన్నింటి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కొండపాక మండల మార్కెట్‌కు మాత్రం ఏర్పాటుచేయలేదు. కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించడంతో పార్టీ నాయకుల మధ్య ఏకాభిప్రాయం రాలేదు. దీంతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేకపోయారని ప్రచారం జరగుతుంది. మండలంలో నాయకుల మధ్య సమన్వయ లోపంతో ఐదారు గ్రూపులు ఏర్పడి వారి వారి అనుచరులకు పదవి ఇవ్వాలని అధిష్టానం దగ్గర ప్రయత్నాలు సాగించారు. ఎంతకీ దీనిపై ఏకాభిప్రాయం లేకపోవడంతో గత ప్రభుత్వం పాలకవర్గం నియామకాన్ని పెండగింగ్‌లో పెట్టినట్లు తెలుస్తున్నది.



కొండపాకలో మార్కెట్ కమిటీ కార్యాలయం, గోదాం

కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కొండపాక మార్కెట్ కమిటీ కార్యవర్గం ఏర్పాటు కానుందని భావించారు. కానీ ఏడాదిన్నరైనప్పటికీ పాలకవర్గం ఏర్పాటు కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన వర్గపోరుతో పాలకవర్గం ఏర్పాటు నిలిచిపోయిందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. కాగా, ఇటీవల నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఇప్పుడైనా కొండపాక మార్కెట్ కమిటీ కార్యరవర్గం నియామకానికి గ్రహణం వీడుతుందా.. లేదా అనేది వేచిచూడాలి.